చదువుమీద శ్రద్ధా? లేక; ప్రియునిమీద ప్రేమా?

శ్రీమతి సమయమంత్రి రాజ్యలక్ష్మిగారు

"ఎక్కడికి వెళుతూన్నారు?" అని అడిగింది సీత.

"క్లబ్బుకి" అని చెప్పాడు రామారావు.

"ఎన్నిసార్లు ప్రార్థించినా యింటిదగ్గర వుండరు కదూ" అని చిన్నబుచ్చుకుంటూ అంది సీత.

"నేను చెప్పినమాట విన్నదాకా ఇంతే. అడిగినా లాభంలేదు. హాయిగా క్లబ్బులో, స్నేహితులతో, విలాసంగా కాలం గడిపే వాళ్లకి పల్లెటూరిపిల్ల దగ్గరతోస్తుందా? ఎప్పటికి నీవు విద్యానాగరికురాల వౌతావో, అప్పుడే నేనింటివద్ద ఉండడం. నీవు నాప్రేమను సంపాదించాలంటే, చదువుకోడమే వుపాయం" అంటూకోపంగా వెళ్ళిపోయాడు రామారావు; పాపం సీత ఏడుస్తూకూర్చుంది.

సీత కాపరానికివచ్చి ఏడాదయింది. పుట్టిల్లు పాలకొల్లు. అంతపల్లెకాదు, పట్టణంకాదు. అక్కడే సీత బోర్డుబాలికాపాఠశాలలో ౨-వ తరగతి (Pass) చేసింది. సంగీతం, నృత్యం ఏవీరావు. ఏదోకొంచెం తెలివితేటలు కలదే కాని, కొంచెం అమాయకపు పిల్ల. మనస్సు చాలామంచిది. సీతభర్త రామారావు చెన్నపట్నంలో B. A. Pass అయి L. T. చదివి విశాఖపట్నం A.V.N. College లో Teacher పనిచేస్తున్నాడు. నవనాగరికత అన్నా, ఆడంబరాలుఅన్నా బాగా అలవాటయ్యాడు. సీత బాగా చదువుకోవాలనీ, తనతో English బాగా మాట్లాడాలనీ, తనతో రోజూ షికారుకు రావాలనీ, సిగ్గుగా వుండకూడదనీ, నాగరికతగా వుండాలనీ, కాపరానికివచ్చింది మొదలు పోరుతున్నాడు. కాని సీత పూర్వపుసాంప్రదాయాల్లో పెరిగిన మూలాన్ని వీటికి ఇష్టపడేదికాదు. రోజూ తన దగ్గర English చదువుకోమని చెప్పేవాడు. సీతకు English అంటే అసలే యిష్టంలేదు. అందులోనూ గాంధీగారిరోజులు. ఎప్పుడైనా ఒకరోజున చెప్పించుకున్నా మళ్ళా అతను అడిగేదాకా పుస్తకంమొహం చూసేదికాదు. సీతకు బాగా చదువుచెప్పి స్కూలుఫైనలు క్లాసున Pass చేయించాలని రామారావు ఆలోచన. సీత కిది సయించదు. ఎన్ని చెప్పినా వినేదికాని English మాట చెప్పేసరికి ససేమిరా అనేది. ఇలాంటి పిల్లతోటి తన సరదాలన్నీ ఎలాగా తీరడం అని అతనికి ఒక్కొక్క సారి ఎంతోవిచారం, కోపంవచ్చేవి. అట్లాంటప్పుడు సీతకు తగిలేవి ఆశీర్వచనాలు. సీతకు కొంచెం పెంకెతనం చేయడం కూడా గద్దు. ఆపెంకెతనం చదువు విషయంలో జాస్తీ అయ్యేది. చదువుకోమని బ్రతిమాలేవాడు, కోప్పడేవాడు, బుజ్జగించేవాడు, సామదానభేదాలు వుపయోగించాడు, కాని లాభం లేకపోయింది. కాపురంక్రొత్తలో సీతవద్దనున్న యీనాగరికత

లోటు అంతగా అతనికి కనుపించక పోయినా రానురాను ఇంగ్లీషు పట్టుదలతో రామారావుకి సీతమీద కొంచెం ఏవగింపు కల్గింది. నాగరికతావరణంకోసం అతను క్లబ్బుకు వెళ్ళడం మొదలుపెట్టాడు. అక్కడ నుంచి రోజూ రామారావు క్లబ్బుకు వెడు తుండేవాడు. ఎప్పుడూ ఎక్కడికైనా వెళ్ళ డమో, ఇంట్లో స్నేహితులతోటో కాల క్షేపం చేస్తూవుండేవాడు. సీతవద్ద నిముష మేనా వుండేవాడుకాదు. సీతమీద ఇష్టం లేకకాదు. ఈవిధంగానైనా సీతబుద్ధి చదువు మీద వ్రాల్తుందేమోనని ఆశ.

చివరకు ఒకరోజున సీత చదువునేర్చు కున్నదాకా అన్యోన్యంగావుండడం కష్టం అని సీతతో చెప్పేశాడు. దానితోటి సీతకు మనస్సు చివుక్కుమన్నది. హృదయం చలించిపోయింది. తన భర్త ప్రేమను తాను సంపాయించడం ఎలాగాఅని ఆలోచన. పోనీ ఏదోవిధంగా చదువుకుందామా అంటే English అంటే మనసుకెక్కదు. చదువు కున్నా రాదని ఆమె కొక విధమైన పిచ్చి నమ్మకం కలిగింది. భర్త అనేమాటలకు వుడుకుబోతుతనం ఒకమూలా, లజ్జ ఒక మూలా, ఇదివరలో చదువుకోలేదని విచా రం ఒకమూలా పీడిస్తున్నై. వీటితోనే మనసు పాడై సీతకు జబ్బుచేసింది. పుట్టింటి వారు వచ్చి తీసుకువెళ్ళారు. రామారావు తనభార్యకు జబ్బు ఎందుచేతవచ్చిందో కను క్కోలేదు. పంపవనలేదు. సీత వెళ్లేటప్పుడు మిమ్మల్ని తృప్తిపరచగలశక్తి నాకు వచ్చి నప్పుడే నేను మీాయింటిలో అడుగుపెట్టడం, లేకుంటే యిదే తుది వందనం" అనిచెప్పి బండెక్కింది.

* * *

సీతకు పుట్టింటి వారెన్నిమందు లిప్పిం చినా, వంటపట్టడంలేదు. తల్లిదండ్రులకేమీా పాలుపోవటం లేదు సీతవిషయంలో. వారికి సీత పకశ్తే కూతురూ, ఇద్దరు కొడుకు లున్నా. సీత కడసారపు కానుపు కాబట్టి చిన్నప్పటినుంచీ చాలాగారాబంగా పెరిగింది. అన్నీ సీత యిష్టప్రకారం జరిగించేవారు తల్లిదండ్రులూ, సోదరులుకూడా. ఇప్పుడు పెద్దన్న బి.యె.నూ, చిన్నన్న ఎఫ్.ఎ.నూ చదువుతున్నారు. సీత వైద్యుడిచ్చిన మందు పుచ్చుకునేదికాదు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా సరే. ఎల్లాగో పుచ్చుకున్నా ఆజబ్బు తగ్గేదికాదు. చివరకు ఇది మనో వ్యాధిలావుంది. మందు ఏమీా లాభంలేదని సెలవిచ్చాడు డాక్టరు బాబు. ఒకరోజున "ఎందుకీబెంగ చెప్పవూ"అని అడిగారు సీత తండ్రి. అలా చెప్పతుందా సీత? తల్లీతండ్రీ బలవంతంపెట్టగా అఖరుకి మెల్లిగా చెప్పింది సంగతంతా. సరేలే, దీనికేనా యింతబెంగ, మనోవ్యథా, నేను చెప్పుతా, చదువుకో" అన్నాడు తండ్రి. మంచిరోజు చూచి విఘ్నే శ్వరపూజ చేశారు. దేవతలు తథాస్తు అన్నారు. క్రమంగా నడుస్తున్నాయి సీత చదువూ, ఆరోగ్యంకూడా. ఆవేళతోటి సీతమనసు స్థిమితపడింది.

* * *

సీతవెళ్ళి రెండుమూడు నెలలైనాకూడా, సీతని పంపమనికానీ, ఎలావుందనికానీ

రామారావు వ్రాశాడుకాడు మామగార్కి. ఇంట్లో చేసిపెట్టేవారు లేక భోజనం హోటలునుంచి తెప్పించుకునేవాడు. తనకు తను పెట్టుకుతినే టప్పుడుమాత్రం సీతలేనిలోటు కన్పించేది. మనస్సు చివుక్కుమనేది. అప్పుడు నాకెందు కిలాంటిబుద్ధి పుట్టాలీ, లోకంలో అందరు ఆడవాళ్లూ చదువుకునే భర్తల్తో కాపురాలు చేస్తూ సంసారాలు దిద్దుకుంటున్నారా? ఇది మాఅదృష్టం కాబోలు. నే కోపంపడేటప్పుడు సీత ఎంత చిన్నపుచ్చుకునేదో, నన్ను గురించి ఎంత బాధపడుతోందో" అని పశ్చాత్తాపపడుతూ భోజనం మొదలుపెట్టేవాడు. కాని అన్నం సరిగ్గా సయించేదికాదు. భోజనంచేసి చెయ్యి కడుక్కున్నదాకానే ఆబుద్ధి. ఆతర్వాత పేకా, క్లబ్బూ, స్నేహితులూ అదీ ఆతురత.

"పోనీ నన్ను గురించి ఒకసారి బాధపడినా, చదువుకుని బాగుపడుతుందిగదా అనుకుని సంతోషించేవాడు.

రామారావుపినతల్లి రామారావుతో కోడల్నిపంపి చాలారోజులైంది. తీసుకురమ్మని చెప్పేది. కాని రామారావు "తీసుకొస్తా, తొందరేవిటి" అంటూ జరిపేయడం వల్ల పినతల్లి "ఏళ్ళేదో దెబ్బలాడుకున్నారో? లేకపోతే సీత అంటే రాముడికి ఇష్టంలేదో? పండువంటి కాపురం భగ్నం అయ్యింది" అని విచారించేది. నెలరోజులైయింది తాను రామందగ్గరకువచ్చి, ఒకరోజున ఆపలేక పోయిం దాందోళన. ఏదో గట్టిగా కనుక్కొని తీరాలని నిశ్చయం చేసుకుంది. అడగడానికి సమయం, అన్నంతినేటప్పుడే రామారావు కనబడడం. ఒకరోజున మజ్జిగపడ్డిస్తూ "అబ్బాయ్, సీతవెళ్ళి చాలా రోజులైంది. నాకు దాన్ని చూడాలనివుంది. తీసుకువస్తా. మళ్లా నే వెళ్ళిపోతా" నన్నది సుబ్బాయమ్మ.

"నేను స్వయంగావెళ్ళి ఎప్పుడూ తీసుకురాను. తనకు బుద్ధి వచ్చినప్పుడు తానే వస్తుంది." అన్నాడు వినుగుతో.

గుండె గుభేలుమన్నది సుబ్బాయమ్మకి. తనకొడుకు ఇంక కోడల్ని తీసుకురాడని నిశ్చయం చేసుకుంది.

సీత చదువుకుంటూన్న సంగతి రామారావుకు తెలియదు. తెలిస్తే తీసుకువచ్చునేమో?

*　　*　　*

సీత రెండేళ్లూ తండ్రివద్దా, పెద్దన్నగారు కేశవరావుదగ్గరా ప్రైవేటుగాచదివి స్కూలు ఫైనలు పరీక్షకు **appear** అయ్యింది. అన్ని పేపర్లూ బాగానే వ్రాసింది. ఇంతవరకూ చదువుబెంగ. ఇంక **Pass or fail** అని బెంగ. పరీక్షతప్పితే తానింక బ్రతకకూడదనుకుంది. కేశవరావు బెజవాడలోవున్న ఒక **Friend**కి వుత్తరం వ్రాశాడు సీత పరీక్షసంగతి ముందుగా వ్రాయమని.

*　　*　　*

విశాఖపట్నంలో సుబ్బాయమ్మ రామారావు మేనత్త గంగమ్మకి రామారావు సీతను తీసుకురానన్నాడనీ, తన కేమీ తోచటం

లేదనీ, తక్షణం రమ్మనీ ప్రత్యుత్తరం వ్రాసింది. గంగమ్మ ఉత్తరం అందినవెంటనే వచ్చింది. సంగతంతావిని ఇంకో సంబంధం చేసుకుంటాడేమో కనుక్కుంటే అన్నది. సుబ్బాయమ్మకిది యిష్టంలేకపోయినా ఎలాగో గంగమ్మ బలవంతంగా వప్పుదలచేసింది.

ఒకనాడు రామాన్ని ఇద్దరూకలిసి అడిగారు ద్వితీయంచేసుకోమని. తన కిష్టంలేనట్లుగా సూచించాడు రామారావు.

పదేపదే అడిగినా నిర్లక్ష్యంగా పూరుకునేవాడు. మౌనం అర్థాంగీకారం అన్నట్లుగా పినతల్లి మేనత్తలు సంబంధాలు వెతకడం ప్రారంభించారు. రాజమండ్రీలో విరియాల వారి సంబంధంవుంది. 14 ఏళ్ళుంటాయి. 4-వ తరగతి ప్యాసుఅయ్యింది. పిల్ల ఎర్రగా బాగానే ఉంటుంది. కట్నం అంత ఎక్కువగా ఈయలేరు. సాంప్రదాయం అయినపిల్ల. చూసుకోమన్నారు రామాన్ని. వాళ్ళలా అనగానే రామారావువళ్ళు భగ్గున మండిపోయింది. హృదయం వేయితేళ్ళు ఒక్కసారిగా కుట్టినట్లయింది. పట్టజాలనంత కోపం వచ్చింది. తనదగ్గర ఆప్రస్తావన తీసుకువస్తే మాటదక్కదు అనిచెప్పి తటాలున జోళ్ళు వేసుకుని బైటికి వెళ్ళిపోయాడు. కాని ఆతని మనస్సులో ఒకవిధమైన దిగులు, పశ్చాత్తాపము సిగ్గు ప్రవేశించాయి. తాను పెద్ద అపరాధంచేసిన వాడిలా భావించుకుని కళవళపడ్డాడు. తాను సీతకు అన్యాయం చేశానను కున్నాడు. ఈ భాధలన్నీ ఎందుకు 2,3 రోజులలో వెళ్ళి సీతను తీసుకువస్తే బాగుంటుందని ఆలోచించాడు.

* * *

నాల్గుగంటలైంది. రామారావు క్లబ్బుకి వెళ్ళడాన్కి సూటు వేసుకుంటున్నాడు. ఇంతట్లోకే గుమ్మందగ్గర బండీ ఆగింది. ఏమిటా బండీ అని రామారావు కిటికీలోనుంచే చూశాడు. బండీలోనుంచి నవనోన్మేష సౌందర్యవిలాసిని అయిన 18 యేండ్లయువతి కాళ్ళకి స్లిప్పర్సు, కళ్ళకోజోడు, చేతికో రిష్టువాచీ, మెడలో ఓచైనూ, వాలుజడా, రిబ్బను వేసుకుని, చేతిలో ఒక కార్డు పట్టుకుని నవనాగరికతా వేషంతో, తనకన్నా కొంచెం పెద్దవాడైన పురుషునితో లోన ప్రవేశించింది. రామారావు ఆ అపరిచితుడినిచూసి నిర్ఘాంతపోయి,

"ఏమోయ్ బావా ఎక్కడినుంచిరాక! అన్నాడు", అతనితో అంత పరిచయంగా వచ్చిన ఆస్త్రీ ఎవరా అని ఆమెవైపు క్రీగంట చూస్తూ.

ఇంటి దగ్గరనుంచే అన్నాడు కేశవరావు చిరునవ్వుతో. ఇంతట్లోకే సుబ్బాయమ్మ నిర్ఘాంతపోతూ కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళుపట్టుకు వచ్చింది. గుమ్మంలో ఒకమూల నాగరికతా కారంలోవున్న సీతను చూచి ఆశ్చర్యపడింది. కుశల ప్రశ్నలైనాయి. సీత తిన్నగా గదిలోకివెళ్ళి తన్ను

గురించి నూతనావేశంతో గదిలోకి వెళ్ళి వున్న రామారావుకు కార్డు అందించింది. బెజవాడనుంచి కేశవరావు స్నేహితుడు కామేశ్వరం సీత స్కూలుఫైనలుక్లాసు ప్యాసయినట్లు వ్రాసినకార్డు అది. రామారావు ఆశ్చర్యపడిపోయాడు. అతనికి పట్టజాలనంత ఆనందంకలిగింది. తానదృష్టవంతుడి ననుకున్నాడు. పాపం సీత చదువుకున్న సంగతే అతనికి తెలియదు.

"ఎక్కడికో ప్రయాణం అయినట్లున్నారు. నే నడ్డుకాదుకదా!" అంది సీత చిరునవ్వుతో, సగర్వంగా.

"ఇక్కడికే" అంటూ సీతకు అతిసామీప్యంగావస్తూ రామారావు అన్నాడు అతులితానందంతో.

* * *

సీతకువచ్చిన దీక్ష చదువుమీద శ్రద్ధవుండా?

లేక

భర్తమీద ప్రేమవలనా?

ప్రణయమహిమ

అధికార్ల సూర్యనారాయణరావుగారు, బి.యె.,బి.యల్.

సూర్యభగవాను డుదయంబు చూపుచుండ
నవని యానంద సందీప్తమైన యట్లు,
ప్రాణసఖియరో! నీవు నావద్దనున్న
నూతనోల్లాస మెదలోన నూలుకొనును!

సందెబంగరు వినువీధి జిందువేళ
కాంచుకనులకు మోక్షంబు కల్గునటులు
జానకీ! నిన్ను చూడ నామానసంబు
సంతసంపు నెత్తురుతోడ జల్లుమనును!

జలధియిసుకల శయనించి చదలవైపు
చూచుకొలదిని విభ్రమం బేచునట్లు
మగువ! నీయెడ ప్రణయాగ్ని రగులువేళ
మనముతప్ప తక్కిన వెల్లమాయమగును!